




# కరపత్రం

SINCE 2014

సోమవారం జనవరి 19, 2026 సంపుటి : 2 సంచిక : 104 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


# బ్రిటీషర్ల కంటే ఎక్కువ ప్రమాదం భాజపాతోనే..

## 400 సీట్లతో రాజ్యాంగ మార్పు యత్నం

- పాశవిక శక్తులను ఓడించాలి
- కమ్యూనిస్టుల స్ఫూర్తితో పోరాటం
- సీపీఐ శతాబ్ది సభలో వ్యాఖ్యలు
- ఖమ్మంలో ఎరుపెక్కిన సభా ప్రాంగణం
- స్వాతంత్ర్యానికి కాంగ్రెస్-కమ్యూనిస్టుల పోరు
- దున్నివాడిదే భూమి నినాదానికి చట్టరూపం
- ఉపాధి హామీ కాంగ్రెస్ బాటలోనే
- ఉపాధి హామీ రద్దుపై విమర్శలు
- కార్పొరేట్ల చేతిలో మోదీ కీలుబొమ్మ
- పేదల హక్కుల తాకట్టు ఆరోపణ
- 240 వద్దే భాజపా ఆగింది
- ఎస్ఐఆర్‌తో ఓటు హక్కుల దెబ్బ




**ఖమ్మం:**
కమ్యూనిస్టు మిత్రులను స్ఫూర్తిగా తీసుకొని గత అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడి.. పాశవికంగా వ్యవహరించిన ప్రభుత్వాలను పడగొట్టామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశాన్ని పట్టి పీడిస్తున్న పాశవిక శక్తులను ఓడించడానికి ప్రతిజ్ఞ చేయాల్సిన అవసరముందన్నారు. సీపీఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలు ఖమ్మంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, సీపీఐ అగ్రనేతలు హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సీపీఐ శ్రేణులతో ఖమ్మం నగరం ఎరుపెక్కింది.

ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "కాంగ్రెస్, కమ్యూనిస్టు సోదరులు కొట్లాడితేనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. దున్నివాడిదే భూమి అని కమ్యూనిస్టు పార్టీ నినాదం ఇస్తే.. దానికి చట్టరూపం కల్పించింది కాంగ్రెస్ సర్కారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చింది. రజాకార్లకు, నిజాంకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడారు. ఆనాడు జరిగిన సాయుధ రైతాంగ పోరాటంలో 4 వేల మంది వీరులు అమరులయ్యారు. మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా ఎర్రజెండా తలెత్తి నిలబడుతుంది. కమ్యూనిస్టుల కంచుకోట ఖమ్మంలో ఈ సభ జరగడం హర్షణీయం. బ్రిటీషర్ల కంటే ఎక్కువ ప్రమాదం భాజపాతోనే. భాజపా అంటే బ్రిటీష్ జనతా పార్టీ. విభజించు, పాలించు, పేదవాళ్లను అణగదొక్కాలని బ్రిటీషర్ల నుంచి వచ్చిన ఆలోచనతోనే... ఇవాళ మనల్ని అణచివేయాలని చూస్తోంది. ఆనాడు కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీ కలిసి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొస్తే.. ఇవాళ ఆ పథకాన్ని రద్దు చేశారు. నరేంద్ర మోదీ కార్పొరేట్ కంపెనీల చేతిలో కీలుబొమ్మగా మారి ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచి.. మల్టీ నేషనల్ కంపెనీలకు మన హక్కులను తాకట్టు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం రద్దుతో మళ్లీ వలసలు మొదలవుతాయి. రాజ్యాంగాన్ని సమూలంగా మార్చడానికి, పేదల హక్కులు కొల్లగొట్టడానికి భాజపా 400 సీట్లు అడిగింది. కానీ, రాహుల్ గాంధీ, కమ్యూనిస్టులు ప్రజల దగ్గరకు వెళ్లి చెప్పడంతో.. 240 సీట్ల వద్దే ఆ పార్టీ ఆగింది. రాజ్యాంగాన్ని దెబ్బ తీసేందుకు మళ్లీ ఎస్ఐఆర్ (ూ×=) తీసుకొచ్చారు. ఎస్ఐఆర్ ద్వారా పేదల ఓటు హక్కును కేంద్రం రద్దు చేస్తోంది" అని సీఎం ఆరోపించారు.

# కట్టుకథలకు లొంగను

- ప్రజల ఆస్తులే నా లక్ష్యం
- వ్యాపారాల కోసం రాజకీయాల్లోకి రాలేదు
- నైనీ బొగ్గు బ్లాక్‌పై కట్టుకథలు
- కేంద్ర నిబంధనల ప్రకారమే టెండర్లు
- టెండర్లు పిలిచింది సింగరేణియే
- మంత్రి పాత్ర లేదని స్పష్టం
- వ్యక్తిత్వ హననానికి హక్కులేదు
- రాజకీయ ఉద్దేశం బయటపెడతా
- సింగరేణి ప్రజల ఆస్తి
- బొగ్గగనులు ప్రజల ఆత్మగౌరవం
- పదవుల కోసం కాదు.. ప్రజాసేవకే
- భయపడి వెనకడుగు వేయను
- మీడియా మధ్య వివాదాల్లో లాగొద్దు



**హైదరాబాద్:**
తెలంగాణ ప్రభుత్వ ఆస్తులు, ఆత్మను కాపాడటమే తన లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆస్తుల సంపాదన కోసమో.. వ్యాపారాన్ని విస్తరించుకునేందుకో రాజకీయాల్లోకి రాలేదని చెప్పారు. నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల విషయంలో ఓ పత్రికలో అడ్డగోలు రాతలు రాశారన్నారు. ప్రజాభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.



# మేడారానికి పోటెత్తిన భక్తులు

**మేడారం:**
మహాజాతరకు ముందే మేడారానికి భక్తులు పోటెత్తారు. వరుస సెలవులు కావడంతో భారీగా రద్దీ నెలకొంది. దీంతో వనదేవతలు సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణం కిటకిటలాడుతోంది. భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన నేడు మేడారంలో మంత్రివర్గ సమావేశం జరగనున్న నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# రంగారెడ్డి ముక్కలాటకు తెర?

- ఎంఐఎం అప్పగింత ఆరోపణలు
- ప్రజాభిప్రాయం లేకుండా విభజనా?
- చార్మినార్‌లో కలపొద్దు: ఎంపీ
- పన్నులు కట్టేవారికి అన్యాయం!
- హైదరాబాద్‌కు ఆర్థిక వెన్నెముక రంగారెడ్డి
- మున్సిపల్ విభజనపై వివాదం
- ప్రజల బ్రతుకులతో చెలగాటం?
- జిల్లా చీల్చొద్దంటూ హెచ్చరిక
- ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు



2లో..

**హైదరాబాద్:**
రంగారెడ్డి జిల్లాను సగం ఎంఐఎంకు అప్పజెప్పాలనే ప్రయత్నం జరుగుతోందని.. కాంగ్రెస్ ప్రభుత్వంపై చేవెళ్ల బీజేపీ ఎంపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

# మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు తెలంగాణ క్యాబినెట్ ఆమోదం

- క్యాబినెట్ భేటీలో కీలక నిర్ణయం
- 116 మున్సిపాలిటీల్లో ఎన్నికలు
- 7 కార్పొరేషన్లు, 2,996 వార్డులు
- డెడికేషన్ కమిషన్ నివేదిక అమలు
- రిజర్వేషన్లు ఇప్పటికే ఖరారు
- వీలైనంత త్వరగా ఎన్నికలు
- మేడారంలో 27వ క్యాబినెట్ సమావేశం
- భూముల కేటాయింపులకు గ్రీన్‌సిగ్నల్
- గోదావరి పుష్కరాలకు శాశ్వత అభివృద్ధి
- బాసర--భద్రాచలం టెంపుల్ సర్క్యూట్
- మెట్రో ఫేజ్--2కు రూ.2,787 కోట్లు
- పొట్లపూర్ ఎత్తిపోతలకు ఆమోదం



2లో..

**మేడారం:**
తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ములుగు జిల్లా మేడారంలోని హరిత హోటల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.



# అదనపు కమిషనర్‌గా చందనా దీప్తి

**హైదరాబాద్ :**
ఫ్యూచర్ సిటీలో ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల క్రమబద్ధీకరణ కోసం ట్రాఫిక్ విభాగం ఏర్పాటైంది. తాజాగా శనివారం గ్రేటర్‌లో 20 మంది ఐపీఎస్ బదిలీల్లో భాగంగా ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ వింగ్‌కు పలువురు అధికారులను బదిలీ చేశారు. ప్రస్తుతం సికింద్రాబాద్ రైల్వేస్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ)గా ఉన్న చందనా దీప్తి..

2లో..

# భారత్ అభివృద్ధి కోసం మోదీ చేసిందేమీ లేదు: డి.రాజా




**ఖమ్మం:**
సీపీఐ ప్రస్థానం ఎన్నో త్యాగాలతో మొదలైందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. సీపీఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలు ఖమ్మంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, సీపీఐ అగ్రనేతలు హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సీపీఐ శ్రేణులతో ఖమ్మం నగరం ఎరుపెక్కింది.డి.రాజా మాట్లాడుతూ.. "1925 డిసెంబరు 26న కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించింది. ఇండియాకు సంపూర్ణ స్వరాజ్యం కావాలని ఆరంభంలోనే సీపీఐ చెప్పింది. 1885లోనే కాంగ్రెస్ పార్టీ ఏర్పడింది. ఆ పార్టీ ఏర్పడి 140 ఏళ్లు గడిచాయి. స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్, సీపీఐ కీలకపాత్ర పోషించాయి. స్వాతంత్ర్య సాధన కోసం సీపీఐ శ్రేణులు పోరాటం చేశాయి. ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమీ లేదు.



కొనసాగుతున్న ఎదురు కాల్పులు..

# ఆరుగురు మావోయిస్టులు మృతి

**భద్రాచలం:**
ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసు బలగాలకు మధ్య ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. కాల్పుల్లో ఇప్పటివరకు ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం.

మిగతాది 2లో

# తొందరలోనే రేవంత్ అధికార కోట కూలుతుంది జగదీష్‌రెడ్డి



**హైదరాబాద్:**
తెలంగాణలో చంద్రబాబుకు పట్టిన గతే రేవంత్‌కూ పడుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై డీజీపీ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దమ్ముంటే బీఆర్ఎస్ దిమ్మెలు కూలగొట్టండి. మేమేంటో చూపిస్తామంటూ జగదీష్‌రెడ్డి సవాల్ విసిరారు. రోత రాతల పత్రికపై చర్యలు తీసుకోవాలని ఐఏఎస్‌ల సంఘం కోరాలి.

2లో..



# కాంగ్రెస్‌లో చేరి తప్పు చేశా.. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**పటాన్‌చెరు అర్బన్:**
కాంగ్రెస్‌లో చేరి తప్పు చేశానని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పటాన్‌చెరు జీఎంఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక

# రంగారెడ్డి ముక్కలాటకు తెర?

మొదటి పేజీ తరువాయి
రంగారెడ్డి జిల్లాను ముక్కలు చేసి.. ఆగం చేయకండి. ప్రజాభిప్రాయం లేకుండా మున్సిపల్ విభజన జరుగుతుంది అంటూ వ్యాఖ్యలు చేశారు.
చేవెళ్ల బీజేపీ ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి తాజాగా మీడియాతో మాట్లాడుతూ..'రంగారెడ్డి చుట్టుపక్కల ఉన్న గ్రామాలను చార్మినార్‌లో కలుపుతున్నారు. రంగారెడ్డి జిల్లాను సగం ఎంఐఎంకు అప్పజెప్పుతున్నారా?. పాతబస్తీలో నీళ్ల బిల్లులు, కరెంట్ బిల్లులు కడతారా?. కట్టని వారితో మా జిల్లా ప్రజలను ఎందుకు కలుపుతున్నారు?. మెజారిటీగా హిందూ ప్రజలున్న గ్రామాలను చార్మినార్‌లో కలపడం సరైంది కాదు. పాతబస్తీలో బిల్లుల ఎగవేత వల్ల వాటర్ బోర్డ్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్లు నష్టాల పాలవుతున్నాయి.
రంగారెడ్డి జిల్లాల గ్రామాలను చార్మినార్‌లో కలపడం వల్ల, ఆ జిల్లా ప్రజల బ్రతుకులు ఆగం అవుతాయి. మాకు గులాంలు కొట్టడం తెలీదు. గులాంలు కొట్టే బ్రతుకులు మావి కాదు. హైదరాబాద్‌కు ఆర్థిక వనరు రంగారెడ్డి. జిల్లా ఖజానా అంతా నాడు కేసీఆర్ ఫామ్ హౌస్‌కు తరలిపోయింది. నేడు ఎంఐఎం ఇలాకాలోకి పంపేందుకు ప్రయత్నం జరుగుతుంది. పన్నులు కట్టేవారిని, పన్నులు కట్టనివారితో కలపకండి. రంగారెడ్డి జిల్లాపై అనేక అపోహలు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాను ముక్కలు చేయకండి. ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలి. ప్రజాభిప్రాయం తర్వాత నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం' అంటూ వ్యాఖ్యలు చేశారు.

## అదనపు కమిషనర్‌గా చందనా దీప్తి

మొదటి పేజీ తరువాయి
ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్ ట్రాఫిక్ విభాగానికి అదనపు కమిషనర్‌గా, కమిషనరేట్ అడ్మిన్‌గా బదిలీ అయ్యారు. 2012 బ్యాచ్‌కు చెందిన చందనా దీప్తిది వరంగల్ జిల్లా. ఈమె ఇటీవలే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీఐజీ)గా పదోన్నతి పొందారు. ఇప్పటివరకు ములుగు హెడ్ క్వార్టర్స్‌లో అదనపు ఎస్పీ (ఆపరేషన్స్)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న శివం ఉపాధ్యాయకు ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ డీసీపీగా స్థానచలనం కలిగించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
ఏడాది తిరక్కుండానే..
గతేడాది ఫిబ్రవరిలో డాక్టర్ గజారావు భూపాల్‌ను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా బదిలీ చేసిన ప్రభుత్వం.. ఏడాది కాలం కూడా గడవక ముందే మళ్లీ బదిలీ చేసింది. ఈయన్ని ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ ఐజీగా స్థానచలనం కలి?పంచారు. దీంతో పాటు భూపాల్ రావు స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్‌కు పూర్తి అదనపు చార్జ్ బాధ్యతలు వహిస్తారు. ప్రస్తుతానికి భూపాల్ రావు స్థానంలో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా ఎవరినీ నియమించలేదు.

## మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు తెలంగాణ క్యాబినెట్ ఆమోదం

మొదటి పేజీ తరువాయి
అనంతరం ఈ సమావేశం వివరాలను మంత్రి సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి.. పొంగులేటి మీడియాకు వివరించారు.
"చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా మేడారంలో 27వ క్యాబినెట్ భేటీ నిర్వహించాం. మంత్రి సీతక్క చొరవతో సీఎం రేవంత్ రెడ్డి, క్యాబినెట్ మంత్రుల ఏకాభిప్రాయంతో అద్భుతంగా సమావేశం జరిగింది. అనేక అంశాలను చర్చించాం. ప్రభుత్వానికి సంబంధించిన 14 ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు భూముల కేటాయింపునకు ఆమోదం తెలిపాం. గడువు పూర్తయిన 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లు, 2,996 వార్డులు, డివిజన్లలో వీలైనంత త్వరగా ఎన్నికలు జరపాలని నిర్ణయించాం. ఇప్పటికే డెడికేషన్ కమిషన్ నివేదిక ఇచ్చింది. దీని ప్రకారం రెండు రోజుల క్రితం రిజర్వేషన్లు ఖరారయ్యాయి. వీలైనంత త్వరగా మున్సిపల్ ఎన్నికలు జరపాలని క్యాబినెట్ ఏకగ్రీవంగా ఆమోదించింది.
2027 జులై 27 నుంచి ఆగస్టు 3వరకు గోదావరి పుష్కరాలు రానున్నాయి. గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ సర్క్యూట్ ఏర్పాటు చేస్తాం. టెంపుల్ సర్క్యూట్ ఏర్పాటుకు ఫిబ్రవరి 15లోపు కన్సల్టెన్సీ నివేదిక ఇస్తుంది. హైదరాబాద్ మెట్రోకు సంబంధించి క్యాబినెట్ సమావేశంలో చర్చించాం. మెట్రో ఫేస్-2 ఏ, బీ దశలకు సంబంధించి భూసేకరణకు రూ.2,787 కోట్లు కేటాయించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ములుగు జిల్లాలో సాగునీరు అందించేందుకు పొట్లపూర్ ఎత్తిపోతల పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది" అని వివరించారు.

## కాంగ్రెస్‌లో చేరి తప్పు చేశా.. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి
సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేసినట్టు సమాచారం. "అప్పటి పరిస్థితుల దృష్ట్యా తప్పటడుగు వేసి కాంగ్రెస్ పార్టీలో చేరా. దాని వల్ల నియోజకవర్గానికి, ప్రజలకు, నాకు వెంట్రుక మందం కూడా లాభం జరగలేదు. మూడు సార్లు భారత రాష్ట్ర సమితి నుంచి ఎమ్మెల్యేగా గెలిపించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరముంది. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధి 5 మున్సిపాలిటీల్లోని 104 మంది కౌన్సిలర్లను గెలిపించేందుకు విభాగాల వారీగా పని చేద్దాం" అని చెప్పినట్టు తెలుస్తోంది. అయితే, ఈ సమావేశానికి మీడియాను అనుమతించలేదు. కేవలం అనుచరులతో మాత్రమే ఎమ్మెల్యే సమావేశమయ్యారు.

## భారత్ అభివృద్ధి కోసం మోదీ చేసిందేమీ లేదు: డి.రాజా

మొదటి పేజీ తరువాయి
అప్పటి బ్రిటీష్ పాలకులతో ఆర్ఎస్ఎస్ చేతులు కలిపింది.
పాలస్తీనాలో మారణహోమం జరుగుతోంది. వేల మంది అమాయకులను ఊచకోత కోస్తున్నారు. ఇజ్రాయెల్, అమెరికా కలిసి పాలస్తీనాలో దారుణాలు చేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో హిట్లర్‌లా మారారు. నియంతలా మారి.. అన్ని దేశాలను బెదిరిస్తున్నారు. ప్రధాని మోదీ అమెరికా ముందు తలవంచారు. భారత్ అభివృద్ధి కోసం మోదీ చేసిందేమీ లేదు" అని డి.రాజా అన్నారు.

## కొనసాగుతున్న ఎదురు కాల్పులు..

మొదటి పేజీ తరువాయి
నేషనల్ పార్క్ అడవుల్లో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, పశ్చిమ సబ్ జోనల్ బ్యూరో ఇన్‌ఛార్జి సున్నం చంద్రయ్య ఎలియాస్ పాపారావు.. నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెడ్జా ఉన్నారని నిఘావర్గాలకు సమాచారం అందడంతో బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెడ్జా సహా నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు బీజాపుర్ ఎస్పీ జితేంద్రకుమార్ తెలిపారు. ఓ మహిళా మావోయిస్టు సహా నలుగురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో దిలీప్ బెడ్జా ఉన్నట్లు గుర్తించారు. అదే ప్రాంతంలో ఇవాళ జరిగిన ఎదురుకాల్పుల్లో మరో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి ఏకే 47, 303 రైఫిల్, ఇన్సాస్, రైఫిల్‌తో పాటు భారీగా పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# కట్టుకథలకు లొంగను

మొదటి పేజీ తరువాయి
"రాష్ట్ర ఆస్తులు, వనరులను సంరక్షించి పేదలకు సమానంగా పంచడమే నా లక్ష్యం. సింగరేణి సంస్థ.. నైనీ బొగ్గు బ్లాక్ టెండర్లను పిలిచింది. దీనిపై కట్టుకథ, పిట్టకథలు అల్లి ప్రజలను మభ్యపెట్టేలా కథనం రాశారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారమే టెండర్లు పిలవాలని సింగరేణి సంస్థకు సూచించాం. నేను వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి సన్నిహితుడిని కాబట్టి.. ఆయనపై ఉన్న కోపం నామీద చూపిస్తున్నారు. ఆ పత్రికలో వచ్చిన కథనం వెనుక రాజకీయ ఉద్దేశం ఏమిటో తెలిశాక పూర్తి వివరాలు వెల్లడిస్తా. గద్దలు, దోపిడీదారులు, వ్యవస్థీకృత నేరగాళ్ల నుంచి తెలంగాణ ఆస్తులను కాపాడతాను.
ఒకరి వ్యక్తిత్వాన్ని హననం చేసే కథనాలు రాసే అధికారం ఎవరికీ లేదు. నాయకుల మధ్య విభేదాలు సృష్టించేందుకు కట్టుకథలు రాశారు. దీనికి భయపడి లొంగిపోయే వ్యక్తిని కాదు. సింగరేణి ప్రజల ఆస్తి.. బొగ్గుగనులు ప్రజల ఆత్మగౌరవం. పదవుల కోసం కాదు.. ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చాను. టెండర్లను పిలిచింది సింగరేణి సంస్థే.. మంత్రి కాదు. క్లిష్ట ప్రాంతాల్లో గనులున్నందున ఫీల్డ్ విజిట్ నిబంధన తప్పనిసరి. ఇలాంటి నిబంధనలు కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోనూ ఉన్నాయి. ఓ ఛానల్ కథనంలో నా పేరును అనవసరంగా తీసుకువచ్చారు. మీడియా సంస్థల మధ్య ఉన్న విషయాల్లోకి ప్రజాప్రతినిధులను లాగొద్దు. వ్యక్తిగత వ్యవహారాల జోలికి వెళ్లడం తగదు" అని భట్టి విక్రమార్క అన్నారు.

## తొందరలోనే రేవంత్ అధికార కోట కూలుతుంది జగదీష్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి
త్వరలోనే పోలీసుల కూడా ప్రభుత్వంపై తిరగబడే రోజు వస్తుందంటూ జగదీష్‌రెడ్డి వ్యాఖ్యానించారు.
"తొందరలోనే రేవంత్ అధికార కోట కూలుతుంది. అసలు రాష్ట్రంలో ఏం జరుగుతుందో ప్రజలకు అర్థం కావడం లేదు. దొంగలు దొంగలు కలిసి ఊర్లు పంచుకున్నట్లు, పంచుకునేందుకు ఒకరికొకరు సహకరించుకుంటున్నారు. నేడు ఖమ్మం సభలో తెలుగుదేశం జెండాలు కనిపించినప్పుడే అర్థమైంది. ఆనాడు చంద్రబాబు కూడా ఇలానే మాట్లాడిండు. అలా మాట్లాడిన బాబును పాతాళలోకానికి ప్రజలు పాతరేశారు." అని జగదీష్‌రెడ్డి గుర్తు చేశారు.
"చంద్రబాబు వైఖరినీ రాజకీయంగా కేసీఆర్ ఎదుర్కొన్నారు. తప్పా వ్యక్తిగత ఆరోపణలు చేయలేదు. కేసీఆర్ కాలి గోటికి రేవంత్ రెడ్డి సరిపోడు. కేసీఆర్ స్థాయికి.. రేవంత్ రెడ్డి గడ్డి పోసతో సమానం. కేటీఆర్‌పై సోషల్ మీడియాలో పోస్టులపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఫిర్యాదు చేస్తే ఇంత వరకు చర్యలు లేవు" అని జగదీష్‌రెడ్డి మండిపడ్డారు.

## హైదరాబాద్ వస్తున్నారా..? ట్రాఫిక్‌లో చిక్కుకోవద్దంటే ఈ రూట్లల్లో వెళ్లండి..

పల్లె జనం చలో హైదరాబాద్ అంటున్నారు. వారం రోజులు సంక్రాంతి సంబరాల్లో మునిగితేలిన జనం మళ్ళీ 'పట్నం బాట పట్టారు. దీంతో పల్లెల్లో సందడి తగ్గి, హైవేలపై రద్దీ పెరిగింది. ఇటు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు జనసంద్రంగా మారాయి. ఈ రద్దీని తగ్గించేందుకు ప్రత్యేక ట్రాఫిక్ డైవర్షన్ చేపట్టారు అధికారులు..
సంక్రాంతి రద్దీ మళ్లీ మొదలైంది. వారం రోజుల సెలవులు ముగియడంతో సొంతూళ్లకు వెళ్లిన వారంతా తిరిగి హైదరాబాద్ బయలుదేరారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు బయలుదేరడంతో ప్రధాన నగరాల బస్ స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లలో భారీ రద్దీ నెలకొంది. విజయవాడ -- హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఎక్కువైంది. నల్గొండ జిల్లా చిట్యాల వద్ద రద్దీ మరింత ఎక్కువగా కనిపించింది. వేల సంఖ్యలో కార్లు, ఇతర వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు వాహనాలను చిట్యాల నుంచి కుడివైపు సింగిల్ రోడ్డులో భువనగిరి మీదుగా హైదరాబాద్ వైపుకు మళ్లించారు. వాహనాల సంఖ్య పెరిగినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు డ్రోన్ కెమెరాలు, సీసీటీవీల సహాయంతో ట్రాఫిక్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సోమవారం కూడా ఇదే స్థాయిలో వాహనాల రద్దీ ఉండే అవకాశం ఉంది.
ఆదివారం అమావాస్య కావడంతో చాలా మంది సొంతూరు విడిచి వచ్చేందుకు ఆసక్తి చూపలేదు. అమావాస్య వేళ ప్రయాణాలు మంచిది కాదని జర్నీని సోమవారానికి పోస్ట్ పోన్ చేసుకున్నారు. దీంతో హైదరాబాద్? వచ్చే వాహనాలను అవసరమైన చోట్ల దారి మళ్లిస్తున్నారు అధికారులు. చిట్యాల, పెద్దకాపర్తి, కొర్లపహాడ్, పంతంగి టోల్?ప్లాజాల దగ్గర ట్రాఫిక్? జామ్? అయ్యే అవకాశాలు అధికంగా ఉండటంతో పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తున్నారు.

**ట్రాఫిక్ డైవర్షన్ రూట్ ఇదిగో..**

-- గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు మిర్యాలగూడ, హాలియా, కొండమల్లేపల్లి, చింతపల్లి, మాల్ మీదుగా హైదరాబాద్ వెళ్లాలంటూ డైరెక్షన్ ఇచ్చారు అధికారులు.
-- మాచర్ల నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు నాగార్జునసాగర్, పెద్దవూర, కొండమల్లేపల్లి, చింతపల్లి, మాల్ మీదుగా హైదరాబాద్‌కు రీచ్ అవ్వాలి.
-- నల్లగొండ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు మర్రిగూడ బై పాస్, మునుగోడు, నారాయణపూర్, చౌటుప్పల్ మీదుగా హైదరాబాద్ చేరుకుంటే సులభంగా ఉంటుందన్నారు అధికారులు.
-- ఇక విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, హాలియా, చింతపల్లి నుంచి మాల్ మీదుగా హైదరాబాద్ చేరుకోవాలని పోలీసులు సూచించారు.

మరోవైపు వాహనదారులకు పొగమంచు చుక్కలు చూపిస్తోంది. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై దట్టమైన పొగమంచు ముసురుకోవడంతో తిరుగు ప్రయాణం అత్యంత కష్టతరంగా మారింది. పొగమంచుతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. వాహనదారులు ఫాగ్ లైట్లు, హెడ్ లైట్లు ఆన్ చేయాలని, హైస్పీడ్‌లో ఓవర్‌టేక్ చేయవద్దని హెచ్చరిస్తున్నారు.

## ఒక్కరోజులు రెండు ఇన్సిడెంట్స్.. ప్రజల పాలిట మృత్యువుగా మారుతున్న చైనా మాంజా!

సంక్రాంతి పండుగ వేళ సరదాకోసం కొందరు వాడే మాంజా దారం అనేక కుటుంబాలను తీవ్ర విషాదంలోకి నెడుతుంది. మొన్నటికి మొన్న సంగారెడ్డి జిల్లా పరిధిలో ఓ ఘటన అందరిని కలిచి వేసింది. సంగారెడ్డి (మం) ఫసల్వాది గ్రామంలో చైనా మంజా మెడకు కోసుకుపోయి ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. మృతుడు బీహార్‌కు చెందిన అద్వైక్‌గా గుర్తించారు పోలీసులు. ఈ ఘటన మరవక ముందే తాజాగా మరో ఇద్దరు యువకుల మెడకు మంజాదారం తగిలి తీవ్రంగా గాయపడ్డారు.
వివరాల్లోకి వెళ్తే.. కొండాపూర్ మండలం సైదాపూర్‌లో చైనా మాంజాతో యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. సాయికుమార్ (18) అనే యువకుడు బైక్ పై పొలానికి వెళు తుండగా మాంజా దారం మెడకు చుట్టుకుంది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే అతన్ని హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ వైద్యులు అతని చికిత్స అందించారు. దీంతో ప్రాణాపాయం తప్పింది.
ఈ ఘటన జరిగిన కాసేపటికే రాయికోడ్ (మం) ధర్మాపూర్ గ్రామంలో మరో సంఘటన వెలుగు చూసింది. స్థానికంగా నివాసం ఉంటున్న సాయి కుమార్ అనే యువకునికి బైక్‌పై వెళ్తుండగా మాంజా దారం మెడకు చుట్టుకొని తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని హాస్పిటల్‌కు తరలించారు. యువకుడిని పరీక్షించిన వైద్యులు అతనికి చికిత్స అందించారు.
ఇలా కేవలం రెండు మూడు రోజుల వ్యవధిలోనే మాంజ దారం వల్ల అనేక మంది గాయపడగా మరికొందరు ఏకంగా ప్రాణాలే కోల్పోయారు. ప్రతి ఏడాది సంక్రాంతి పండగ సందర్భంగా సరదాకోసం వాడే ఈ కనిపించిన మృత్యువులు ప్రజల పాలిక యమపాశాలుగా మారుతున్నాయి. వీటిని నియంత్రించేందుకు ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపడుతున్నా.. ప్రజల్లో మాత్రం ఎలాంటి మార్పు రావట్లేదు. ఇప్పటికైనా ప్రజలు మేల్కొని ఇలాంటి చైనా మాంజాను వినియోగించవద్దని బాధితులు కోరుతున్నారు.

# మంత్రి వివేక్ ఒంటెద్దు పోకడలు పార్టీకి రాజీనామా చేసిన కాంగ్రెస్ నేత

మున్సిపల్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు ఉమ్మడి జిల్లా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామి పార్టీలో ఒంటెద్దు పోకడలు, ఏకపక్ష నిర్ణయాలు, నియంత పరిపాలన తీవ్రంగా కలిచి వేసిందని పేర్కొంటూ కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. త్వరలో తాను అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు రాజిరెడ్డి ప్రకటించారు.ఈ సందర్భంగా రాజీనామాకు గల కారణాలను లేఖ ద్వారా వివరించారు. కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, చెన్నూర్ మేనిఫెస్టోకు ఆకర్షితుడినై గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ , స్థానిక శాసన సభ్యుడు గడ్డం వివేక్ విజయానికి విశేష కృషి చేశానని తెలిపారు. అయితే కాంగ్రెస్ ఇచ్చిన హామీలో ఏ ఒక్క హామీని నెరవేర్చ లేదని ఆరోపించారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ హామీలపై ప్రజల్లో తీవ్రమైన ప్రతికూల పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు.మంత్రి వివేక్ చెన్నూరు నియోజకవర్గానికి ప్రత్యేకంగా రూపొందించిన మేనిఫెస్టోలో ఒక్క హామీని నెరవేర్చ లేదని దుయ్యబట్టారు. దీనికి తోటు నియోజకవర్గంలో 45 వేల మంది యువకులకు ఉద్యోగాలు, మైనింగ్ ఇన్సిట్యూట్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, అగ్రిరీసెర్చ్ సెంటర్, అగ్రికల్చర్ మినీ యూనివర్సిటీ, కరకట్టల నిర్మాణం హామీ ముందడుగు పడలేదని వెల్లడించారు.ఎమ్మెల్యే వివేక్‌పై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత, వివేక్ విడుదల చేసి మోసపూరిత మేనిఫెస్టోతో ప్రజల్లో విశ్వసనీయతను కోల్పోవడంతోనే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు.

## టిడిపి నేతల వైసిపి గుండాల దాడి

### ఒకరు మృతి..మరో ఇదదరికి తీవ్ర గాయాలు

జిల్లాలోని తుని ప్రాంతంలో వైసీపీ నేతలు బరితెగించారు. కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామంలో కనుమ పండుగ రోజు ఘోరం జరిగింది. పుట్టినరోజు వేడుకలకు వెళ్లి తిరిగి వస్తున్న టీడీపీ నేతలపై కొందరు వైసీపీ కార్యకర్తలు విచక్షణా రహితంగా దాడి చేశారు. మాటువేసి మరీ కత్తులు, ఇనుప రాడ్లతో ముగ్గురు వ్యక్తులపై దాడి చేశారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వైసీపీ నేతల దాడిలో లాలం బంగారయ్య(30) అనే టీడీపీ నేత తీవ్రమైన కత్తిపోట్లతో నేలకొరిగాడు. వెంటనే ఆయన్ను తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కొద్ది నిమిషాల్లోనే మృతిచెందాడు. గాయపడిన ఇద్దరు టీడీపీ నేతలు ప్రస్తుతం.. కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో శ్రీరామ్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది.
శుక్రవారం రాత్రి ఓ టీడీపీ నేత పుట్టినరోజు వేడుకల నుంచి తిరిగి వస్తుండగా.. సుమారు 20 మంది మంది కలిసి కత్తులు, ఇనుప రాడ్లతో వారిపై దాడి చేశారు. ఇరు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. ఘటన తర్వాత గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు పరారైనట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. టీడీపీ నేతలపై దాడితో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. దీంతో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. టీడీపీ నేతలపై దాడి ఘటన జిల్లాలో తీవ్ర కలకలం రేపుతోంది.

## నచ్చజెప్పేందుకు వెళ్లిన పాపానికి..దాడి

తొండంగి మండలం ఏ.కొత్తపల్లి తూర్పు వీధిలో వైసీపీ శ్రేణులు రెచ్చిపోయారు. గుండాట డబ్బుల పంపకాల్లో వైసీపీలో రెండు వర్గాల మధ్య వివాదం చెలరేగింది. ఘర్షణ తీవ్రస్థాయి చేరడంతో వారికి నచ్చజెప్పేందుకు వెళ్లిన టీడీపీ నేతలపైనే వైసీపీ కార్యకర్తలు తిరిగి దాడి చేశారు. వీరిని ఒక వర్గంగా భావించి బీరు బాటిళ్లు, కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో టీడీపీకి చెందిన కొంజర్ల గోవిందు, నామాల గోపికి గాయాలయ్యాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ముంబయిలో కుట్ర పూరిత గెలుపు

**- యుద్ధం ఇప్పుడే మొదలయ్యింది**
**- కార్యకర్తల భేటీలో ఉద్ధవ్ ఠాక్రే**

యుద్ధం ముగియలేదని.. ఇప్పుడే మొదలయ్యిందని శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు. బిజెపి వారి కుట్రలను త్వరలోనే బయటపెడతామన్నారు. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానికంగా బలంగా ఉన్న పవార్, ఠాక్రే కుటుంబాలను వెనక్కి నెట్టి భాజపా నేతృత్వంలోని కూటమి ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే తమ కార్యకర్తలతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక ఎన్నికల్లో అవకతవకలు జరిగినందువల్లే భాజపా గెలుపొందిందని ఆరోపించారు. కుట్రపూరితంగా, అక్రమంగా విజయం సాధించిందన్నారు. ముంబయిని పూర్తిగా తాకట్టు పెట్టాలని ఆ పార్టీ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఈ ఒక్క గెలుపుతో తమను నిర్వీర్యం చేశామని భాజపా నేతలు భావిస్తున్నారని, అది ఎప్పటికీ సాధ్యం కాదని ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. ఎన్నికల్లో తమ పార్టీ 64 స్థానాలను కైవసం చేసుకుందని తెలిపారు. ముంబయిలో శివసేన (ఐః÷) నుంచి మేయర్‌ను నియమించాలనేది తన కల అని.. అదే జరగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.
227 స్థానాలున్న బృహన్‌ముంబయి (బీఎంసీ)లో అధికారాన్ని కైవసం చేసుకోవడానికి అవసరమైన 114 సీట్ల కన్నా అధికంగానే భాజపా, శివసేన (శిందే)తో కూడిన కూటమి సీట్లు సాధించింది. భాజపా 89 స్థానాల్లో విజయం సాధించింది. శిందే నేతృత్వంలోని శివసేన 27 చోట్ల గెలుపొందింది. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన 64 స్థానాలను కైవసం చేసుకుంది. రెండు దశాబ్దాల పాటు విడివిడిగా ఉన్న ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే (మహారాష్ట్ర నవ నిర్మాణ సేన) ఈ ఎన్నికలకు ముందే జట్టుకట్టినా మహాయుతి విజయాన్ని అడ్డుకోలేకపోయారు.

## తండ్రిపై రీల్స్ చేస్తూ ఆలయం గుడి మెట్లు ఎక్కిన కూతురు.. అంతలోనే..!

తండ్రి కూతురు మధ్య బంధం గురించి ఎంత చెప్పినా తక్కువే..! నాన్నకు పిల్లలు అందరూ ఒక్కటే.. అయితే కూతురు అంటే కొంచెం ఎక్కువ ప్రేమ. తండ్రికి తన కూతురే ప్రాణం.. ఆ కూతురికి నాన్నే ఇలలో నడిచే దైవం.. హీరో.. నవ మాసాలు మోసి జననం ఇవ్వక పోయినా.. తన జన్మకు కారణమైన తండ్రి అంటే కూతురికి పంచప్రాణాలు. చనిపోవడానికి కొన్ని గంటల ముందు తండ్రితో కూతురు చేసిన రీల్ ను చూసి జనం కంటతడి పెడుతున్నారు.
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పులిగిల్ల గ్రామానికి చెందిన చంద్రకళ-ఇస్తారి దంపతుల కూతురు లాస్య. లాస్యను ఎనిమిదేళ్ల క్రితం యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామానికి చెందిన కర్రే అనిల్‌కు ఇచ్చి వివాహం చేశారు. అనిల్ ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా, లాస్య ఇంటి వద్దే ఉంటుంది. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. లాస్య నిత్యం పరిసరాలు, సామాజిక అంశాలపై రీల్స్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసేది.
అయితే భర్త అనిల్ అయ్యప్ప మాల ధరించి శబరిమలకు వెళ్లాడు. లాస్య కూతురు పుట్టినరోజు సందర్భంగా తన తల్లిగారి ఇల్లు పులిగిల్లకు వచ్చింది. గ్రామంలోనీ రామలింగేశ్వర స్వామి దేవాలయానికి తన తండ్రి, ఇద్దరు పిల్లలతో కలిసి దేవాలయానికి వెళ్ళింది. మెట్ల మార్గంలో తన తండ్రితో కలిసి స్వామివారిని దర్శించుకునే క్రమంలో.. తండ్రిపై ఉన్న ప్రేమను వ్యక్తీకరిస్తూ రీల్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేసింది. మెట్లు ఎక్కుతూ ఆలయానికి చేరుకుంది. రామలింగేశ్వర స్వామిని దర్శించుకునే క్రమంలో ఆలయం కోనేరులోకి దిగి నీళ్లు చల్లుకుంటుండగా జారిపడి లాస్య మృతి చెందింది.
చనిపోవడానికి కొన్ని గంటల ముందే తండ్రిపై తనకున్న ప్రేమను చాటుకుంది. నాయనా.. నాయనా అంటూ ఇన్‌స్టాలో పోస్ట్ చేసిన రీల్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ వీడియోని చూసిన నెటిజన్లు సైతం ప్రతి ఒక్కరూ కంటతడి పెడుతున్నారు. అప్పటి వరకు ఉత్సాహంగా ఉన్న బిడ్డ విగతజీవిగా మారడంతో ఆ తండ్రి తల్లడిల్లిపోయాడు. లాస్య మరణ వార్తతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

# విశ్రాంత ఉద్యోగుల క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



**కొండబత్తిని అమర్ నాథ్, కోరుట్ల ప్రతినిధి**

విశ్రాంత ఉద్యోగుల క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల 2026 క్యాలెండర్, డైరీలను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, బిఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల అభ్యున్నతికి తాము ఎంతో కృషి చేశామని, సంఘానికి స్థలం, నిర్మాణ నిధులు అందించామని వారు తెలిపారు. సంఘ అభివృద్ధికి, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో పోరాడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వినియోగిస్తున్న దుకాణాలకు

**- జరిమానా విధించిన కోరుట్ల అధికారులు**



**కొండబత్తిని అమర్ నాథ్, కోరుట్ల ప్రతినిధి**

కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీందర్ ఆదివారం పట్టణంలో చికెన్ సెంటర్లు, కిరాణా దుకాణాలు, టిఫిన్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను స్వాధీనం చేసుకుని, దుకాణదారులకు రూ. 4,600 జరిమానా విధించారు. అలాగే, లైసెన్స్ రీన్యువల్ చేయించి రూ. 5,944 ఫీజు వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, అశోక్ పాల్గొన్నారు.

# అత్యవసర సమయంలో రక్తదానం



**గాజెంగి మహేశ్వర్, మెటుపల్లి ప్రతినిధి**

అత్యవసర సమయంలో రక్తదానం చేసి మానవత్వం చాటిన అమీర్ మెట్ పల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన కుంట రాజం అనే వ్యక్తి చికిత్స నిమిత్తం కోరుట్ల పట్టణంలోని శ్రీ శ్రీనివాస హాస్పిటల్ లో చేరారు. ఆదివారం వైద్యులు రక్తం అవసరమని చెప్పడంతో రోగి బంధువులు రక్తదాత కోసం వెతకగా, పట్టణానికి చెందిన హిందుస్తాన్ పాన్ షాప్ యజమాని అమీర్ ఏ పాజిటివ్ రక్తాన్ని అందించారు. అత్యవసర సమయంలో రక్తదానం చేసిన అమీర్ ను మాజీ కౌన్సిలర్ మహ్మద్ షాకీర్ సిద్ధికి రోగి బంధువులు అభినందించారు.


# మేడ్చల్ ఏడు గుళ్ళు అమ్మవారి ఆలయంలో అన్న ప్రసాద వితరణ



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

మేడ్చల్ పట్టణంలో నీ ఏడు గుళ్ళు అమ్మవారి ఆలయం దగ్గర శ్రీ పాద వల్లభ ట్రస్టు ఆధ్వర్యంలో మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ రమేష్ గుప్తా మాట్లాడుతూ ప్రతి నెల అమావాస్య రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నర్సింహులు పటేల్, శేకర్ పటేల్, జాంలాల్ నాయక్, నర్సింహ, ఓంకార్, సంతోష్, అశోక్ పాల్గొన్నారు. ఒక పూట కడుపు నిండా అన్నం పెట్టడమే ఈ కార్యక్రమ లక్ష్యం.

# వరుస చోరీల కలకలం



**- పోలీసు ఇంట్లోనే చోరీ**

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

హైదరాబాద్ మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగల బీభత్సం కలకలం రేపింది. కేవలం 24 గంటల వ్యవధిలో ఒక కానిస్టేబుల్ ఇల్లు సహా మూడు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. భారీగా బంగారం, వెండి, నగదు దోచుకెళ్లారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

# తపస్ రాష్ట్ర కార్యదర్శిగా నేడు నవీన్ ప్రమాణ స్వీకారం

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

తపస్ రాష్ట్ర కార్యదర్శిగా నేడు నవీన్ ప్రమాణ స్వీకారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర కార్యవర్గాన్ని ఆదివారం నాడు రాబోయే మూడేళ్ల కాలానికి ఎన్నుకున్నారు. మేడ్చల్ మండలం అత్వెల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గడప నవీన్ రెండవసారి రాష్ట్ర కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం




చేశారు. గత 20 ఏళ్లుగా తపస్ బలోపేతానికి కృషి చేస్తున్నానని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీని కూడా గెలుచుకున్నామని నవీన్ తెలిపారు. ఉపాధ్యాయులలో జాతీయ భావాలను పెంపొందించి, విద్యారంగ బలోపేతానికి కృషి చేస్తానని, మేడ్చల్ జిల్లాలో తపస్ ను శక్తివంతంగా తీర్చిదిద్దుతానని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర నాయకత్వానికి రెండవసారి అవకాశం కల్పించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# శునకానికి నిలువెత్తు బంగారం

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జనవరి 18:**

పెంపుడు శునకం ఆరోగ్యం కుదుటపడాలని మొక్కులు మొక్కిన ఓ వ్యక్తి ఆ శునకానికి నిలువెత్తు బంగారం (బంగారంలా భావించే బెల్లం) సమర్పించి సమ్మక్క సారక్క వన దేవతలకు మొక్కు తీర్చుకున్నాడు. ఈ విచిత్ర సంఘటన ఆదివారం పెద్దపల్లి పట్టణంలో జరిగింది. శ్రీమాతా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ కాసర్ల రాజు అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న పెంపుడు శునకం భైరవకు గత నెల సుస్తీ చేసింది. తీవ్ర అనారోగ్యంతో ఏమి తినకుండా అస్వస్థకు గురైంది. ఆ సమయంలో అతనికి ఏమి తోచక సమ్మక్క సారక్క దేవతలకు మొక్కుకున్నాడు. శునకం ఆరోగ్యం కుదుట పడితే జాతర సమయంలో నిలువెత్తు బంగారం సమర్పిస్తానని సమ్మక్క సారక్క దేవతలకు మొక్కులు మొక్కుకున్నాడు. మొక్కిన రెండు రోజులకే భైరవకు ఆరోగ్యం కుదుటపడింది. మొక్కు నెరవేరింది. కాబట్టే కుక్కకు నిలువెత్తు బంగారం సమర్పించానని కాసర్ల రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ మాత డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సిఎంఓ కోట మల్లేష్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, డైరెక్టర్లు, సభ్యులు బొడ్డు సుమన్ బొడ్డుపల్లి రవి, బండ రాజయ్య, కొమరిశెట్టి శ్రీనివాస్, ఓరుగంటి శ్రీధర్ సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా మైనారిటీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్య నేతల సమావేశం.

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ జనవరి 17**

మున్సిపల్ ,కార్పొరేషన్ ఎన్నికల్లో ముస్లీం మెజారిటీ ఓట్స్ సంబంధించిన డివిజన్ లలో 30 శాతం ముస్లింలు ఉన్న డివిజన్స్ లలో గతంలో కాంగ్రెస్ పార్టీ టికెట్ పై పోటీ చేసినవారు, కాంగ్రెస్ పార్టీ కోసం కష్టకాలంలో పని చేసిన సీనియర్ నేతలకు పార్టీ టికెట్ ఇవ్వాలని జిల్లా కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్ మొహమ్మద్ తాజోద్దిన్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు నేహాల్, అహ్మద్, లయీఖ్ ఖాద్రీ ,అబ్దుల్ రహ్మాన్, అహ్మద్ ,ఆలీ ,మోసిన్, ఎండీ కలిముద్దీన్, సయ్యద్ ఖమరోద్దీన్, హాజీ షెబాన ,మొహమ్మద్ ఖాజా ఖాన్, ఫిరోజ్ ,మెరాజ్, జమీల్, ఇమ్రాన్ బషీర్ అబ్దుల్ బారి అజీం ముజాహిద్ శాహిన్న షాహేబాజ్ హసీనా సిరాజ్ ఆరిఫ్ ఆలీ అబ్దుల్ గఫార్ షాకీర్ సలీం మాసూమ్ ఖాన్ ఖాజా ఖాన్ ఖలీల్ జక్కి అజ్మత్ అహ్మద్ హనీఫ్ విఖార్ ఖాజా మొహమ్మద్ జాఫర్ గౌస్ ఇక్రం ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు

## ఆరవ వార్డు లో వార్డుకు చెందిన వారినే గెలిపించు కుంటాం

**కరపత్రం ప్రతినిధి అందోలు (జనవరి 18)**

అందోల్ జోగిపేట మున్సిపల్లో 6వ వార్డ్ కౌన్సిలర్ బరిలో కాంగ్రెస్ పార్టీ, బిఆర్ఎస్ పార్టీ, స్వతంత్ర అభ్యర్థి నిలిచిన ఆ వార్డ్ కి సంబంధించిన వ్యక్తి ఉండాలి అలాంటి వ్యక్తినే మేము గెలిపించుకుంటామని గ్రామ ప్రజలు వ్యక్త పరుస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఆరో వార్డు నుంచి సంబంధించిన వ్యక్తి కావాలని ఓటర్లు ఒక ఉద్దేశం తో ఆవ్యక్తిని గెలిపించుకున్నారు. ఇప్పుడు అదే ఉద్దేశంతో ఈ ఎన్నికల్లో కూడా గ్రామ ప్రజలు అదే ఎవ్వరైనా సరే ఆరో వార్డు కి సంబంధించిన వ్యక్తి ఉండాలి అని ఆరో వార్డు ప్రజలు వారి అభిప్రాయాలు వ్యక్తపరుస్తున్నారు..

# గృహజ్యోతి పథకం ద్వారా పేద ప్రజలకు తగ్గిన ఆర్థిక భారం

**- గృహ జ్యోతి పథకంతో పేదల కుటుంబాల్లో వెలుగులు**

**- గృహ జ్యోతి పథకం లబ్ధిదారులకు పత్రాలు అందచేసిన మాజీ జడ్పీటీసీ సభ్యులు గీకురు రవీందర్**

**చిగురుమామిడి. జనవరి 18,కరపత్రం ప్రతినిధి**

గృహజ్యోతి పథకంతో పేదల కుటుంబాల్లో వెలుగులు నిండాయని. ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీల లో భాగంగా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి పథకాల రూపంలో అమలు చేస్తున్నారని చిగురుమామిడి మాజీ జడ్పీటీసీ సభ్యులు గీకురు రవీందర్ అన్నారు. రాష్ట్ర



వ్యాప్తంగా గృహలక్ష్మి పథకం కింద 52, 82,498 కుటుంబాలు జీరో విద్యుత్ బిల్లు ద్వారా లబ్ధిపొందుతున్నాయన్నారు. ఈ పథకం ప్రారంభం నుండి నేటి వరకు ప్రజలు చెల్లించాల్సిన సుమారు రూపాయలు 3,593 కోట్ల రూపాయలను ప్రభుత్వం పూర్తిగా భరించి లబ్ధిదారుల పక్షాన విద్యుత్ సంస్థలకు చెల్లించింది అన్నారు. కాంగ్రెస్ నాయకులు మరియు విద్యుత్ ఉద్యోగులతో కలిసి డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క నుంచి వచ్చిన గృహ జ్యోతి గ్రీటింగ్స్ ను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అర్హులై ఉండి నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ ను వినియోగించిన పేద, మధ్య తరగతి ప్రజలకు జీరో బిల్లు కింద ఉచితంగానే విద్యుత్ సరఫరా చేస్తున్నట్లుగా ఈ సందర్భంగా గీకురు రవీందర్ తెలిపారు. ఇదే తరహాలో ఇప్పటికే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కూడా రేవంత్ రెడ్డి సర్కార్ కల్పించిందన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దాసరి ప్రవీణ్ కుమార్ నేత, నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ ,కక్కెర్ల సంపత్ గౌడ్ ,ట్రాన్స్ కో లైన్ ఇన్స్పెక్టర్ దాసరి రాములు, లైన్మెన్ ఆడెపు లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ లైన్ మెన్ మేడిపల్లి సామ్రాజ్యం, జూనియర్ లైన్ మెన్ రాకేష్, లబ్దిదారులు పాల్గొన్నారు.

# గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఓటర్ జాబితాలో అవకతవకలు

**- మున్సిపల్ అధికారుల తీరుపై బీజేపీ నాయకుడు కమ్మరి శ్రీనివాస్ సంచలన ఆరోపణలు**

**- న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని స్పష్టం**

**- నేడు--రేపు న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్న కమ్మరి శ్రీనివాస్**

**గజ్వేల్ జనవరి 18, కరపత్రం ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో ఆదివారం బీజేపీ నాయకుడు కమ్మరి శ్రీనివాస్ మీడియా సమావేశం నిర్వహించారు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఓటర్ జాబితా తయారీ, వార్డుల విభజన, కొత్త ఓటర్ల నమోదు సవరణల ప్రక్రియలో తీవ్రమైన అవకతవకలు చోటుచేసుకున్నాయని గజ్వేల్--ప్రజ్ఞాపూర్ 6వ వార్డు బీజేపీ నాయకులు కమ్మరి శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.గత ప్రభుత్వ నాయకులు ప్రస్తుత అధికార పార్టీ నాయకుల ఒత్తిడులకు లోబడి మున్సిపల్ అధికారులు





పనిచేస్తూ, తమ ఇష్టానుసారంగా అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధమైన వైఖరి గజ్వేల్--ప్రజ్ఞాపూర్ ప్రజలకు తీవ్ర అన్యాయాన్ని కలిగిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు గజ్వేల్--ప్రజ్ఞాపూర్‌లో భారతీయ జనతా పార్టీ రోజురోజుకు బలపడుతున్న తీరు, ప్రతి వార్డులో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాదరణ పొందుతున్న వాస్తవాన్ని ఓర్చుకోలేని అధికార పార్టీ గత ప్రభుత్వానికి చెందిన కొందరు నాయకులు, బీజేపీపై అణిచివేత ధోరణిని అవలంబిస్తున్నారని విమర్శించారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని అన్నారు.

బడుగు, బలహీన వర్గాల బలోపేతం, సమాన హక్కుల కల్పన కోసం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతూ అధికారులు వ్యవహరిస్తున్న తీరు అమానుష్యమని ఆయన తీవ్రంగా ఖండించారు గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఓటర్ జాబితా మరియు వార్డుల విభజనలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా, తుది జాబితా విడుదల చేయడంలో బి.ఎల్.ఓలు మరియు సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. ఈ అవకతవకలపై న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసి, న్యాయం జరిగే వరకు తన పోరాటాన్ని కొనసాగిస్తానని కమ్మరి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# మున్సిపల్ ఎన్నికల్లో గౌడులకు సముచిత స్థానం కల్పించాలి.

**- పెద్దపల్లి గౌడ జేఏసీ నాయకుల డిమాండ్.**

**పెద్దపల్లి, జనవరి 18 కరపత్రం ప్రతినిధి**

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో గౌడ సామాజిక వర్గానికి రాజకీయంగా సముచిత స్థానం కల్పించాలని పెద్దపల్లి నియోజకవర్గ గౌడ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో గౌడ జేఏసీ నియోజకవర్గ అధ్యక్షుడు బాలసాని వెంకటేశం అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు బొబ్బిలి రాజమౌళి గౌడ్, పడాల కొమరయ్య గౌడ్, బాలసాని వెంకటేష్ గౌడ్, పడాల సతీష్ గౌడ్ మాట్లాడుతూ పెద్దపల్లి మున్సిపాలిటీలో తమ సామాజిక వర్గానికి 5 వేల నుండి 10 వేల వరకు ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ రాజకీయ




పార్టీలు తమను కేవలం ఓటు బ్యాంకుగా, జెండాలు మోసే కార్యకర్తలుగా మాత్రమే వాడుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క గౌడ అభ్యర్థికి కూడా కౌన్సిలర్‌గా పోటీ చేసే అవకాశం ఇవ్వకపోవడం శోచనీయమని, ఈ వివక్షను ఇకపై భరించే ప్రసక్తే లేదని వారు స్పష్టం చేశారు. పెద్దపల్లి మున్సిపాలిటీలోని 36 వార్డులలో కనీసం 3 నుండి 4 వార్డులను గౌడ సామాజిక వర్గానికి కేటాయించాలని అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. ఏ పార్టీ అయితే తమ సామాజిక వర్గానికి ప్రాధాన్యతనిచ్చి టికెట్లు కేటాయిస్తుందో ఆ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం తమ సంఘం శ్రేణులన్నీ ఏకతాటిపై నిలిచి సంపూర్ణంగా మద్దతు తెలుపుతాయని ప్రకటించారు. ఒకవేళ తమ డిమాండ్లను నిర్లక్ష్యం చేస్తే రాబోయే ఎన్నికల్లో గౌడుల ఐక్యత, సత్తా ఏంటో రాజకీయ పార్టీలకు రుచి చూపిస్తామని ఈ సందర్భంగా జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో గుర్రం సదానందం గౌడ్, బండారి సునీల్ గౌడ్, బండారి సుమన్ గౌడ్, బండి నరేందర్ గౌడ్, అడ్డగుంట శ్రీనివాస్ గౌడ్, సతీష్ గౌడ్, వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, తదితులు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
సోమవారం జనవరి 19, 2026

## ఘనంగా బెజ్జంకి శ్రీ ఆద్రితి జన్మదిన వేడుకలు



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ జనవరి 17**
ప్రముఖ న్యాయవాది హిందూ వాహిని జిల్లా సంయోజక్ బెజ్జంకి శ్రీకాంత్ న్యాయవాది స్పందన దంపతుల కుమార్తె బెజ్జంకి శ్రీ ఆద్రితి జన్మదినాన్ని పురస్కరించుకొని గిద్ద పెరుమాల్ల గోశాలలో గడ్డి వితరణ చేశారు .వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ చేశారు .100 చిన్న పిల్లలకి బిర్యానీ పంపిణీ చేశారు.ఈ విషయంలో బెజ్జంకి శ్రీకాంత్ మాట్లాడుతూ మా తల్లి ఉషా ఆశీర్వాదంతో ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు సేవ చేస్తున్నామని చెప్పారు.

## కరీంనగర్ సిటీ యూత్ కాంగ్రెస్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గా ఉప్పరి విశాల్



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ జనవరి 17**
కరీంనగర్ పట్టణంలోని వివిధ డివిజన్లకు యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నూతనంగా నియమితులైన డివిజన్ అధ్యక్షులకు నియామక పత్రాలను తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ అందజేశారు.
ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముత్యం శంకర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , కరీంనగర్ జిల్లా ఆర్టీఏ సభ్యులు పడాల రాహుల్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు పంజాల కృప సాగర్ తో పాటు పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను యువతలో మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజాసమస్యల పరిష్కారంలో యూత్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులు పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

## బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించిన సాయికుమార్



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జనవరి 18:**
కాకతీయ బుక్ ఆఫ్ నేషనల్ రికార్డ్స్ కు ఎంపికైనట్లు గోదావరిఖని చెందిన సాయికుమార్ వెల్లడించారు. ఆర్ఎఫ్ సిఎల్ లోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు సాయికుమార్ కాకతీయ బుక్ ఆఫ్ రికార్డ్స్ కు ఎంపికైనట్లు తెలిపారు. ఇటీవల వరంగల్ జిల్లాలోని పబ్లిక్ గార్డెన్స్ లో అంజలి మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అనే కార్యక్రమంలో జానపద నృత్య ప్రదర్శనలో పాల్గొని పలువురి మన్ననలు పొందారు.దీంతో సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన కాకతీయ బుక్ ఆఫ్ నేషనల్ రికార్డ్స్ కు సాయికుమార్ ఎంపికై నిర్వాహకులచే బంగారు పతకం, ప్రశంసా పత్రం పొందారు. బుక్ ఆఫ్ నేషనల్ రికార్డ్స్ లో చోటు చేసుకున్నందుకు గాను పాఠశాల ప్రిన్సిపల్ రవి, డీన్ రమేష్, ఉపాధ్యాయులు సంతోష్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

## కాంగ్రెస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం




**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ జనవరి 17**
కరీంనగర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కృపాసాగర్ ఆధ్వర్యంలో కరీంనగర్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది.
ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ కో ఇంచార్జ్ రోష్ని జైస్వాల్ ,రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా =ూా మెంబెర్ పడాల రాహుల్ పాల్గొనీ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులను నియమించడం జరిగింది. మున్సిపల్ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ పాత్ర,
ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను,అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లడం , ఓట్ చోరీ, జాతీయ ఉపాధి హామీ చట్టం పథకంలో మహాత్మా గాంధీ పేరును మార్చే విధంగా బిజెపి మోడీ సర్కార్ చేస్తున్న కుట్రను ప్రజలకు తెలియజేయాల్సిందిగా కోరుతూ,విత్ ఐవైసి యాప్ , పలు అంశాలపై యువజన కాంగ్రెస్ నాయకులకు దిశా నిర్దేశం చేయడం జరిగింది.
ఈ కార్యక్రమం లో జిల్లా యువజన కాంగ్రెస్ ఇంచార్జి కొమ్ము జోహార్ , రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ సుందర్ , జిల్లా అధ్యక్షులు ముత్యంశంకర్ ,జిల్లా,నియోజకవర్గం, మండల యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టికెట్ల కేటాయింపులో యువతకు ప్రాధాన్యం.

**- గంగపుత్రులు మా కుటుంబానికి**
**- మొదటి నుంచి సన్నిహితులే.**

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ జనవరి 11**
టైగర్ జగపతిరావు కుమారుడిగా కరీంనగర్ అభివృద్ధికి కృషి చేస్తున్న..
కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు
200 మందితో వెలిచాల సమావేశం.రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో యువతకు టికెట్ల కేటాయింపులో తగిన ప్రాధాన్యత ఉంటుందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జి వెలిచాల రాజేందర్రావు స్పష్టం చేశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న యువత రాజకీయాల్లో మరింత రాణిస్తారని తెలిపారు.ఆదివారం కొత్తపెల్లిలోని వెలిచాల ప్రజా కార్యాలయానికి 46వ డివిజన్ కు చెందిన కాంగ్రెస్ నాయకుడు పెద్దపెల్లి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో 200 మంది డివిజన్ ప్రజలు, గంగపుత్ర సంఘం



నాయకులు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు, యువకులతో కలిసి తరలివచ్చారు. ఈ సందర్భంగా వెలిచాల రాజేందర్రావును మర్యాదపూర్వకంగా కలిశారు. రాజేందర్ రావును గోపాలకృష్ణ శాలువాతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజేందర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీ వైపే మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు పెద్ద సంఖ్యలో ఆశవాహులు ఆసక్తి చూపుతున్నారని పోటీ అధికంగా ఉందని పేర్కొన్నారు. సర్వే ప్రకారంగా జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కమిటీ టికెట్లను ఖరారు చేస్తుందని తెలిపారు. 46 డివిజన్లో గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన గోపాలకృష్ణకు ప్రజల్లో మంచి ఆదరణ ఉందని పేర్కొన్నారు. ఇలాంటి యువత రాజకీయాల్లో ఉండడం ప్రజలకు కలిసి వస్తుందన్నారు. డివిజన్లో కష్టపడి పనిచేస్తూ విజయానికి కృషి చేయాలని సూచించారు. గంగపుత్రులు మాజీ ఎమ్మెల్యే జగపతిరావు కు, మా కుటుంబానికి మొదటి నుంచి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. తండ్రి టైగర్ జగపతిరావు అడుగుజాడల్లో నడుస్తూ కరీంనగర్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. కరీంనగర్ ప్రజలే మా కుటుంబ సభ్యులని అందుకోసమే ప్రజాసేవకే నిరంతరం పాటుపడుతున్నానని రాజేందర్రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సత్యనారాయణ, మోసం అంజయ్య నాగుల కనకయ్య, శ్రావణ్ పటేల్ తోపాటు కరీంనగర్ పట్టణ గంగపుత్ర సంఘం నాయకులు కాంగ్రెస్ నాయకులు డివిజన్ ప్రజలు, మహిళలు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సోదర ప్రేమ, ఐక్యతే సమాజ ఐక్యతకు పునాది - లవ్ ఫెస్ట్‌లో సబితా ఇంద్రారెడ్డి

**మహేశ్వరం: ఎన్టీఆర్ నగర్, జనవరి 18/ కరపత్రం ప్రతినిధి.**
సమాజంలో సోదర ప్రేమ, ఐక్యతను మరింత బలపరిచే లక్ష్యంతో క్రైస్తవ సంఘం నిర్వహించే లవ్ ఫెస్ట్ కార్యక్రమాలు ఆదర్శప్రాయమని మాజీ మంత్రి, మహేశ్వరం శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు.
ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం ఎన్టీఆర్ నగర్ డివిజన్ పరిధిలోని బాప్టిస్ట్ చర్చ్‌లో నిర్వహించిన క్రైస్తవుల లవ్ ఫెస్ట్ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులకు ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి, కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, లవ్ ఫెస్ట్ అనేది కేవలం మతపరమైన కార్యక్రమం మాత్రమే కాకుండా, సమాజంలో పరస్పర గౌరవం, సహకారం,




ఐక్యతను పెంపొందించే సామాజిక ఉద్యమమని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకొచ్చే ఇలాంటి కార్యక్రమాలు సామాజిక సమరసతకు బలమైన పునాదిగా నిలుస్తాయని ఆమె తెలిపారు.క్రైస్తవ సంఘం ఎల్లప్పుడూ విద్య, వైద్యం, సేవా రంగాల్లో విశేషంగా సేవలందిస్తూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తోందని ఆమె ప్రశంసించారు. ప్రజల ఐక్యతే రాష్ట్ర ప్రగతికి



మూలమని, అన్ని మతాలు, అన్ని వర్గాలు కలిసి ముందుకు సాగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె స్పష్టం చేశారు.ఈ సందర్భంగా తాను చిన్నతనంలో మిషనరీ పాఠశాలలో విద్యనభ్యసించిన విషయాన్ని గుర్తు చేసుకుంటూ, అక్కడ నేర్చుకున్న క్రమశిక్షణ, సేవాభావం తన ప్రజాజీవితానికి పునాదిగా నిలిచాయని తెలిపారు.

## రాబోయే కాలంలో 7వ వార్డు పరిధిలోని ప్రతి వీధి, ప్రతి కాలనీ, ప్రతి కుటుంబం సంక్షేమమే నా ప్రధాన లక్ష్యం.

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జనవరి 18**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని 7వ వార్డు -- దుర్గా కాలనీలో గత 25 సంవత్సరాలుగా స్థానికుడిగా నివసిస్తూ, ఈ ప్రాంత ప్రజల జీవన విధానాన్ని, వారి అవసరాలను, సమస్యలను దగ్గరగా తెలుసుకున్న వ్యక్తిని నేను. వృత్తిరీత్యా ఒక జర్నలిస్టుగా, సమాజంలో ప్రజలకు సంబంధించిన అంశాలపై నిరంతరం పనిచేస్తూ, ప్రజల సమస్యలకు స్వరం ఇచ్చే బాధ్యతను నిజాయితీగా నిర్వర్తిస్తూ వస్తున్నాను.
ప్రజల అవసరాల నిమిత్తం తెలిసిన వ్యక్తిగా, ప్రజలతో నిత్యం మమేకమై ఉండే వ్యక్తిగా, నా పరిధిలో ఉన్నంతవరకు ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నాను. ముఖ్యంగా ప్రజల ప్రాథమిక అవసరాలైన తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ఎప్పుడూ ప్రాధాన్యం ఇస్తూ పనిచేశాను.
అదేవిధంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు ప్రభుత్వ సంక్షేమ పథకాల నుంచి దూరం కాకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా మార్గనిర్దేశం చేస్తూ, సహాయ సహకారాలు అందిస్తూ వచ్చాను.
ప్రజల సమస్యలను కాగితాలకే పరిమితం చేయకుండా, నేరుగా కాలనీల్లోకి వెళ్లి, ప్రజలతో మాట్లాడి, వారి బాధలను విని, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపే దిశగా కృషి చేస్తున్నాను. మన ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడి ఉండకూడదనే సంకల్పంతో, ప్రతి పనిని బాధ్యతగా నిర్వర్తిస్తానని మీకు హామీ ఇస్తున్నాను.



స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కలిసి రావడం ఈ సేవా ప్రయాణానికి ప్రజల ఆశీర్వాదంగా భావిస్తున్నాను. ఇది కేవలం రాజకీయ అవకాశం కాదు, ప్రజల కోసం మరింత అంకితభావంతో పనిచేయాల్సిన బాధ్యతగా స్వీకరిస్తున్నాను. ప్రజా ప్రతినిధిగా ఎన్నికైతే, మీరు నాపై పెట్టే నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే నా ప్రధాన లక్ష్యం.
ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చే ప్రతి హామీ మాటలకే పరిమితం కాకుండా, చర్యల రూపంలో అమలు చేయడమే నిజమైన సేవ అనే నమ్మకంతో ముందుకు సాగుతాను. అభివృద్ధి అంటే కేవలం భవనాలు కాదు, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అసలైన అభివృద్ధి అని నమ్ముతున్నాను.
మహిళల సంక్షేమం, రైతులకు అండగా నిలిచే కార్యక్రమాలు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే నిర్ణయాలు వంటి ప్రభుత్వ ప్రజాకర్షక పథకాలు ప్రజలకు చేరువయ్యేలా దగ్గరుండి పనిచేసే బాధ్యత గల పౌరుడిగా మీ ముందుకు వస్తున్నాను.
ప్రభుత్వం తీసుకొస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా స్థానికంగా పర్యవేక్షణ చేస్తూ, ప్రజల సమస్యలపై స్పందించే ప్రభుత్వానికి మీ వార్డు నుంచి బలమైన మద్దతు అందేలా కృషి చేస్తాను.
మీ కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉండి, మీ అభివృద్ధికే ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్న ఈ ప్రభుత్వానికి మీ మద్దతు, సహకారం అత్యంత అవసరం. ప్రజా సంక్షేమం నిరంతరం కొనసాగాలంటే ప్రజలే ప్రభుత్వాన్ని బలపర్చాలి.
ఈ నేపథ్యంలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 7వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా నేను పోటీలో ఉన్నాను. నాపై నమ్మకం ఉంచి, మీ విలువైన ఓటుతో గెలిపించి, అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉన్న పాలనకు మీ మద్దతు తెలపాలని వినమ్రంగా కోరుతున్నాను.మన దుర్గా కాలనీని ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దేందుకు, మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు మీ ఆశీర్వాదాలు నాకు అవసరం.సదా మీ సేవలో 7వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్‌గా ఒక అవకాశం ఇవ్వండి

# 24వ వార్డు కౌన్సిలర్ రేసులో అరికిల్ల స్రవంతి

**- తెలంగాణ జనసమితి పార్టీ (ŋజీూ) అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి అరికిల్ల స్రవంతి**
**- ఒక్క అవకాశం ఇవ్వండి -- అభివృద్ధి చేసి చూపిస్తా**
**- రాజకీయాల కోసం కాదూ ప్రజా సేవ కోసమే నా పోటీ**
**- నాయకురాలిగా కాదూ మీ సేవకురాలిగా పని చేస్తా**
**- మీ ఆడబిడ్డగా ఆదరించండి -- మీ ఇంటి ఆడపడుచుగా అండగా ఉంటా**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జనవరి 18**
రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో




జమ్మికుంట పట్టణంలోని 24వ వార్డు నుంచి తెలంగాణ జనసమితి పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నానని పార్టీ రాష్ట్ర నాయకురాలు అరికిల్ల స్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు.
వార్డు ప్రజలు ఆశీర్వదించి ఒక అవకాశం కల్పిస్తే, 24వ వార్డు రూపురేఖలు మార్చి, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని ఆమె హామీ ఇచ్చారు. కుల, మతాలకు అతీతంగా మహిళా అభ్యర్థిగా బరిలో నిలిచి, ప్రజల విశ్వాసంతో గెలిస్తే నిస్వార్థంగా ప్రజా సేవ చేయడమే నా లక్ష్యమని స్పష్టం చేశారు.
24వ వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, మహిళలు--యువత సమస్యలపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. ప్రజలు ఆశీర్వదిస్తే తప్పకుండా విజయం సాధించి, నాయకురాలిగా కాదు -- సేవకురాలిగా ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని ధీమా వ్యక్తం చేశారు.పైసల ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లొంగకుండా, నిజాయితీగా, పారదర్శకంగా ప్రజా సేవ చేయడానికే పూర్తి సమయం కేటాయిస్తానని ఈ సందర్భంగా అరికిల్ల స్రవంతి పేర్కొన్నారు.